క్లుప్తంగా

సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌కు ఎమ్మెల్యే సత్కారం



నూజివీడు: స్థానిక సబ్ కలెక్టర్‌గా పనిచేసిన ఆదర్శ్ రాజేంద్రన్‌ను మంగళవారం ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఘనంగా సత్కరించారు. ఇటీవల ఆయన నెల్లూరు జాయింట్ కలెక్టర్‌గా బదిలీ అయిన విషయం విదితమే. సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆదర్శ్ రాజేంద్రన్‌ను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు శీలం రాము పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

చాట్రాయి: డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం బుధవారం చాట్రాయి హైస్కూల్‌లో జరుగుతుందని ఎంపీడీఓ దుర్గాప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉదయం 10.30 గంటలకు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేస్తారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కును ఎంపీపీ పాలడుగు జోత్స్న లబ్ధిదారుని కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు. గుంటుపల్లి రమేష్ నగర్‌కు చెందిన లబ్ధిదారు లేళ్ల లక్ష్మీలత అనారోగ్యానికి గురై శస్త్రచికిత్స చేయించుకున్నారు. ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా రూ.1.20 లక్షల మంజూరయ్యాయి. నాయకులు పాలడుగు దుర్గాప్రసాద్, బండి వెంకటరావు, నాగుల్‌మీరా పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ. 1.37 లక్షలు

మేడూరు(గంపలగూడెం): మేడూరు వీరాంజనేయస్వామి ఆలయంలో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించారు. గత 44 రోజుల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ. 1,37,435 ఆదాయం లభించిందని ఆలయ మేనేజర్ జన్ను వెంకటేశ్వరరావు తెలిపారు. గన్నవరం ఇన్‌స్పెక్టర్ సుధాకర్ పర్యవేక్షణలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు ముత్యాల రామకృష్ణ, బరిగెల రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు చేరువైన వైద్యం

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు వైద్య సేవలు చేరువయ్యాయని ఎంపీపీ పాలడుగు జోత్స్న అన్నారు. గుంటుపల్లి ఆర్‌సీఎం చర్చి వద్ద రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంగళవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని వివరించారు. శిబిరానికి హాజరైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. పీహెచ్‌సీ వైద్యురాలు పర్వీన్ వైద్య సేవలు అందజేశారు.

కుష్ఠు వ్యాధిపై అపోహలు తొలగాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): కుష్ఠు వ్యాధిపై సమాజంలో ఉన్న అపోహలు, వివక్ష తొలగించాలని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ పద్మావతి అన్నారు. ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి, గొల్లపూడి ప్రాంతాల్లో మంగళవారం జరిగిన స్పర్శ లెప్రసీ అవగాహన కార్యక్రమాల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ ఫిబ్రవరి 13 వరకూ స్పర్శ కార్యక్రమం జరుగుతుందన్నారు. వ్యాధి లక్షణాలు, చికిత్స తదితర అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు, ప్రాథమిక దశలో వ్యాధిని గుర్తించి చికిత్స అందించడం ద్వారా తదుపరి కేసులు రాకుండా చూడవచ్చునని వివరించారు. రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ (లెప్రసీ) డాక్టర్ ఎస్. దేవసహాయం, జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ జె. ఉషారాణి, డీఐఓ డాక్టర్ అమృత, డీఎంఓ డాక్టర్ మోతీబాబు పాల్గొన్నారు. రోగులకు పోషకాహార కిట్లు, చెప్పులు అందజేశారు.

● **ముసునూరు:** స్పర్శ కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సులు నిర్వహించి వాల్‌పోస్టర్ విడుదల చేశారు. పీహెచ్‌సీల వైద్యాధికారులు షకీనా ఇవాంజిలిన్, కరీముల్లా మాట్లాడుతూ వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వైద్య శాఖ, సచివాలయ సిబ్బంది, ఆశ వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల నిరసన

గంపలగూడెం: అద్దంకిలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి గుర్తుతెలియని వ్యక్తులు పేడవేసి అవమానించడం దారుణమని ఆర్యవైశ్య సంఘం గంపలగూడెం మండల శాఖ నాయకులు అన్నారు. మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి స్థానిక గాంధీ సెంటర్‌లో నిరసన తెలిపారు. పలువురు మాట్లాడుతూ నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు వేములపల్లి రామకృష్ణ, గౌరవ అధ్యక్షుడు నాళ్ల చిన్న సత్యంబాబు, కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చారుగుండ్ల సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు కొత్తగుండ్ల నరసింహారావు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

విజయవాడ ఎంపీ కేశినేని నాని

ఎ.కొండూరు: గిరిజనుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని విజయవాడ ఎంపీ కేశినేని నాని అన్నారు. చైతన్యనగర్ తండాలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో రూ. 95 లక్షల ఎంపీ నిధులతో నూతనంగా నిర్మించిన సమావేశ మందిరాన్ని మంగళవారం ఎంపీ కేశినేని నాని, వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు ప్రారంభించారు. ఎంపీ కేశినేని నాని మాట్లాడుతూ ఎంపీ నిధులు రూ. 95 లక్షలతో నాణ్యత ప్రమాణాలతో నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేసి ప్రారంభించామన్నారు. మండలంలో గిరిజనులు కిడ్నీ వ్యాధి బారిన పడి ఇబ్బందులకు గురవుతున్నా చంద్రబాబు పట్టించుకోలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి కిడ్నీ రోగులకు మెరుగైన వైద్యం, ఉచిత మందులు, డయాలసిస్ కేంద్రం ఏర్పాటు, డయాలసిస్ రోగులకు నెలకు రూ. 10 వేలు పింఛన్లను ఇచ్చి ఆదుకుంటున్నారని తెలిపారు. కోట్లాది రూపాయల వ్యయంతో కృష్ణా జలాలు అందించనున్నామన్నారు. కిడ్నీ ప్రభావిత గ్రామాల్లో వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నామని, గ్రామాల్లో వాటర్ ట్యాంకర్లు కూడా పంపిణీ చేశామన్నారు. ఈ మండలానికి ఎంపీ నిధులు రూ. 8 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు మాట్లాడుతూ గిరిజనులకు ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందిస్తున్నారని చెప్పారు. నూతనంగా నిర్మించిన సమావేశ హాల్‌కు ఫర్నిచర్, వంట పాత్రలు కూడా అందిస్తామన్నారు. అనంతరం జీళ్లకుంట, పోలిశెట్టిపాడు గ్రామాల జాతీయ రహదారి పక్కన నూతనంగా రూ. 16 లక్షలతో నిర్మించిన బస్‌షెల్టర్లను ఎంపీ కేశినేని నాని, నల్లగట్ల స్వామిదాసు ప్రారంభించారు. తొలుత వీరికి గిరిజనులు సంప్రదాయ పద్ధతిలో ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు నరెడ్ల వీరారెడ్డి, ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, జెడ్పీటీసీ భూక్య గనియా, సర్పంచ్ భూక్య ఝాన్సీ, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి ఎ. సునీత, వైఎస్సార్ సీపీ నాయకులు కె. చెన్నారావు, వి. బ్రహ్మానందరెడ్డి, ఎ. వెంకటరెడ్డి, టి. వెంకటేశ్వరరెడ్డి, పి. చంద్రమోహన్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు టి. సురేష్, సర్పంచులు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ అధ్యక్షులు పాల్గొన్నారు.

2024 తర్వాత టీడీపీ కనుమరుగు..

తిరువూరు: 2024 అసెంబ్లీ ఎన్నికల తర్వాత తెలుగుదేశం పార్టీ కనుమరుగవుతుందని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శ్రీనివాస్(నాని) అన్నారు. మంగళవారం తిరువూరు నగర పంచాయతీలో రూ.50 లక్షల ఎంపీ నిధులతో కొనుగోలు చేసిన వాటర్ ట్యాంకర్లు, ట్రాక్టర్లను ఎంపీ ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ పార్టీ నుంచి బయటకు వెళ్లిన వారిని ఎలా తిట్టాలో టీడీపీ కార్యాలయం నుంచి ముందుగానే ఆ పార్టీలోని నేతలకు చెబుతారని, మీడియా సమావేశాలు పెట్టి అదేపనిగా తిట్టిస్తూ చంద్రబాబు మానసిక ఆనందం పొందుతారన్నారు. చంద్రబాబుకు ఇవే ఆఖరి ఎన్నికలని, తర్వాత బోర్డు తిప్పివేయడం ఖాయమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అధికశాతం పేదలు లబ్ధి పొందారని, ప్రతి కుటుంబానికీ ఆ పథకాల ద్వారా ప్రయోజనం చేకూరిందని నాని వివరించారు. తిరువూరు నియోజకవర్గంలో తాగు, సాగునీటి సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరవుతాయని, అన్ని గ్రామాలకూ వేసవిలో దాహార్తి తీర్చడానికి తాగునీటి సరఫరా ట్యాంకర్లను మంజూరు చేశామని చెప్పారు. తిరువూరు పట్టణానికి త్వరలో తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందన్నారు. వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ కన్వీనర్ నల్లగట్ల స్వామిదాసు మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడి సమస్యలను గుర్తించిన వెంటనే నిధులు కేటాయిస్తోందని తెలిపారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, వెంకటేశ్వరి, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, సుందరకుమార్, మోదుగు ప్రసాద్, పరసా సత్యనారాయణ, మూడు దుర్గారావు, నాయకులు చలమాల సత్యనారాయణ, అజీజ్, బాలకృష్ణ, విజయలక్ష్మి పాల్గొన్నారు.





ఎ.కొండూరులో సమావేశహాల్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ కేశినేని నాని, స్వామిదాసు ; తిరువూరులో వాటర్ ట్యాంకర్లను ప్రారంభిస్తున్న ఎంపీ కేశినేని నాని, స్వామిదాసు

నేడు సమావేశాలు

తిరువూరు: తిరువూరు నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం జరుగుతుందని కమిషనర్ బాలకృష్ణ తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే సమావేశంలో కౌన్సిలర్లు ప్రతిపాదించిన పలు అంశాలపై చర్చ జరుగుతుందని చెప్పారు.

● **గంపలగూడెం:** గంపలగూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు. అన్ని శాఖల అధికారులు తగిన సమాచారంతో హాజరు కావాలన్నారు.

● **విస్సన్నపేట:** మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ ఎస్. వెంకటరమణ మంగళవారం తెలిపారు. సంబంధిత మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

● **నూజివీడు:** పట్టణ పురపాలక సంఘం పాలకవర్గ సాధారణ సమావేశం బుధవారం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్ మంగళవారం తెలిపారు. చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశంలో కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొనాలని కోరారు.

జేవీవీ డైరీ ఆవిష్కరణ

తిరువూరు: జన విజ్ఞాన వేదిక నూతన సంవత్సర డైరీని తిరువూరులో మంగళవారం ఆవిష్కరించారు. స్థానిక జ్యోతి నర్సింగ్‌హోం ఆవరణలో జరిగిన జేవీవీ సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షుడు వల్లభనేని రవీంద్ర డైరీని ఆవిష్కరించారు. జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. గంగాధర్, ఉపాధ్యక్షుడు హరికృష్ణ, రాంప్రదీప్, సుదర్శన్, సుధాకర్, సుబానీ, లీలాప్రసన్న పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో విప్లవాత్మక మార్పులు

- మహిళాభ్యున్నతికి పెద్ద పీట
- ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు
- నూజివీడులో ఆసరా చెక్కుల పంపిణీ

నూజివీడు: మహిళల ఆర్థికాభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. స్థానిక ఎస్ఆర్ఆర్ హైస్కూల్ ఆవరణలో నాలుగో విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. నూజివీడు మండలంలోని 1,527 గ్రూపులకు రూ.15.49 కోట్లు, నూజివీడు పట్టణంలోని 663 గ్రూపులకు రూ.6.81 కోట్ల రుణం మాఫీ అయింది. ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన తరువాత నాలుగు విడతల్లో డ్వాక్రా సంఘాల మహిళల రుణాన్ని మాఫీ చేశారని వివరించారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పుల వల్ల విద్యారంగం దేశంలోనే మొదటి స్థానానికి ఎగబాకిందని, పేదరికం తగ్గిందని వివరించారు. అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, విద్యా దీవెన, వసతి దీవెన, రైతు భరోసా, వాహన మిత్ర, కాపునేస్తం, జగనన్నతోడు తదితర పథకాల అమలు ద్వారా పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. జగనన్న విద్యా కానుక కిట్ల ద్వారా పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలు, యూనిఫాం, బ్యాగు, షూలు తదితర అనేక వస్తువులను ప్రభుత్వమే విద్యార్థులకు అందిస్తోందని చెప్పారు. ప్రజా సంక్షేమానికి నిరంతరం శ్రమిస్తోన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ప్రజలపై ఉందని అన్నారు.



నూజివీడు మండల మహిళలకు నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

మహిళలను ముంచిన చంద్రబాబు..

2014కు ముందు రుణ మాఫీ చేస్తానని, బ్యాంకులకు నగదు చెల్లించొద్దని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత రుణమాఫీ చేయకుండా మహిళలను నట్టేట ముంచిన ఘనుడు చంద్రబాబు అని ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు ధ్వజమెత్తారు. పసుపు కుంకుమ అంటూ మహిళలను ప్రలోభ పెట్టడానికి చూడగా గత ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పి చంద్రబాబును గద్దె దింపారని గుర్తుచేశారు. మోసం చేసే చంద్రబాబును నమ్మవద్దని, ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు మహిళలందరూ అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ స్టేట్ కో–ఆపరేటివ్ యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ, వైస్ చైర్మన్లు పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, ఎంపీపీ ఆరేపల్లి శిరీష, వైస్ ఎంపీపీ అక్కినేని శ్రీవాణి, జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, నాయకులు రంజిత్‌రెడ్డి, షేక్ మస్తాన్, మున్షీ, కాలి సుగుణరావు, ఆరేపల్లి రాంబాబు, అచ్చి కాసులు, పలువురు కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మహాత్ముని మార్గం అనుసరణీయం

మైలవరం: మహాత్మా గాంధీ చూపిన అహింసా మార్గం అనుసరణీయమని ఆర్య వైశ్య సంఘం మైలవరం అధ్యక్షుడు బయన శ్రీనివాసరావు అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా మైలవరం నూజివీడు రోడ్డులోని మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ అహింస, సత్యాగ్రహాలతో బ్రిటిష్ వారితో పోరాడి దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి కాజా మహేష్, జిల్లా మాజీ అధ్యక్షుడు జూలకంటి ప్రసాద్, చారుగుండ్ల ప్రసాద్, రేపాక వాసు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చలవాది మధుసూదనరావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

● **గంపలగూడెం:** మండలం ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో గంపలగూడెం గాంధీ సెంటర్‌లో సంఘం మండల శాఖ అధ్యక్షులు వేములపల్లి రామకృష్ణ గాంధీజీ విగ్రహానికి, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం గౌరవ అధ్యక్షుడు నాళ్ల చిన్న సత్యంబాబు, కిరాణా మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు చారుగుండ్ల సుబ్బారావు, వనమా సుజాత, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. గోసవీడు, ఊటుకూరులో వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి.

● **కొండపల్లి(ఇబ్రహీంపట్నం):** మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమం వైఎస్సార్ సీపీ కొండపల్లి కార్యాలయంలో మంగళవారం జరిగింది. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మిక్కిలి శరభయ్య ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ సత్యం, అహింస మార్గాన్ని ఆయుధాలుగా చేసుకుని స్వాతంత్ర్యం సాధించారని చెప్పారు. పట్టణ మాజీ అధ్యక్షుడు ఎంఏ బేగ్, కౌన్సిలర్ అడపా వెంకయ్యనాయుడు, నాయకులు బ్రహ్మాజీ, మాజీ ఎంపీటీసీ ఏడుకొండలు, రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొర్రా కిరణ్ మహాత్మునికి శ్రద్ధాంజలి ఘటించారు.



కొండపల్లిలో నివాళులర్పిస్తున్న శరభయ్య, నాయకులు

● **ముసునూరు:** రమణక్కపేటలో సర్పంచ్ రంగు ధనలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ కొండా దుర్గాభవానీ గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లోపూడి ఆశ్చర్య పాఠశాలలో జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్, యల్లాపురంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి యోహాను, చెక్కపల్లిలో మండల కళాకారుల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు కూసం మార్కండేయులు, బొల్లిన నాగరాజు ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సెంట్రల్ జోన్ సాఫ్ట్‌బాల్‌లో విద్యార్థుల ప్రతిభ

మైలవరం: జేఎన్‌టీయూ కాకినాడ సెంట్రల్ జోన్ సాఫ్ట్‌బాల్ (మెన్)లో మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం రాత్రి వరకు జరిగిన పోటీల్లో ఆరు టీమ్‌లు పాల్గొనగా గుడ్లవల్లేరు ఎస్ఆర్‌జీఈసీ ద్వితీయ స్థానం, విజయవాడ వీఆర్ఎస్ఈసీ తృతీయ స్థానం, ఆగిరిపల్లి ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాల నాలుగో స్థానంలో నిలిచాయి. ప్రథమ స్థానంలో నిలిచిన ఎల్‌బీఆర్‌సీఈ విద్యార్థులు ఎం.సందీప్, ఎ.సాయి యశ్వంత్, బి. సాయికిరణ్, యు. అభినవ్, షేక్ ఖాజా మొయినుద్దీన్ సౌత్ జోన్ పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులను పలువురు అభినందించారు.

ఓవర్ లోడ్‌తో ప్రయాణాలు వద్దు

నూజివీడు: వాహనాల్లో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని, లోడు వేయరాదని నూజివీడు మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.నాగమురళి అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవన్‌లో రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నాగమురళి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ప్రమాదాల నియంత్రణకు పలు సూచనలు చేశారు. ఆర్టీసీ డిపో మేనేజర్ సీహెచ్ సూర్య పవన్‌కుమార్, ఆర్టీసీ పీఆర్‌ఓ కేఎల్‌వీ నరసింహం, డ్రైవర్లు పాల్గొన్నారు.

దివ్యాంగ బాలలను ఆదరించాలి

ముసునూరు: దివ్యాంగ బాలలను ఆదరించాలని రమణక్కపేట మెయిన్ ప్రాథమిక పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం సురేష్ అన్నారు. మంగళవారం సమగ్ర శిక్షా అభియాన్ ముసునూరు మండల విభాగం ఆధ్వర్యంలో రమణక్కపేట మెయిన్ ప్రాథమిక పాఠశాల భవిత కేంద్రంలో దివ్యాంగ బాలల తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించి పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయుడు సురేష్‌బాబు, ఐఈఆర్ టీచర్లు ఎంవీ లక్ష్మీ నారాయణరావు, జె.నాగమల్లేశ్వరి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

ఎ.కొండూరు: చీమలపాడు అంకమ్మ మహాలక్ష్మమ్మ అమ్మవారి ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. ఏఎస్ఐ వై. లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం .. గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి తాళాలు పగులగొట్టి హుండీలోని నగదును చోరీ చేశారు. క్లూస్ టీమ్ వేలిముద్రలు సేకరించారు. ఆలయ చైర్మన్ మరీదు జమలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

జి.కొండూరు: మండల పరిధి కట్టుబడిపాలెం, పినపాక, వెలగలేరు గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లను మైలవరం సీఐ కిశోర్‌బాబు, జి.కొండూరు ఎస్ఐ షబ్బీర్ అహ్మద్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఆయా గ్రామాల్లో స్థానికులతో మాట్లాడిన సీఐ కిశోర్‌బాబు, శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల పాత్రపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

విస్సన్నపేట: మండలంలోని 12 గ్రామ పంచాయతీలలో 2022–2023 సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదిక స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించారు. సామాజిక తనిఖీ సిబ్బంది గ్రామాల్లో తనిఖీ నిర్వహించి సంబంధిత నివేదికను ప్రజావేదికలో సమర్పించారు. 679 పనులకు సంబంధించి రూ.14,61,92,479 ఖర్చు చేశారు. డ్వామా పీడీ జె. సునీత, జిల్లా విజిలెన్స్ అధికారి వి. విజయలక్ష్మి, ఏపీడీ కె. పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

నూజివీడు: నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు ముగిసిన నేపథ్యంలో విజేత జట్లకు మంగళవారం బహుమతుల పంపిణీ కార్యక్రమం ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో నిర్వహించారు. ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. యువత అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ క్రీడల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీ స్టేట్ కో–ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, ఎంపీడీఓ వీఏ విజయ్‌కుమార్, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, ఎంపీపీలు ఆరేపల్లి శిరీష, కొండా దుర్గాభవాని, జెడ్పీటీసీలు వరికూటి ప్రతాప్, పిన్నిబోయిన వీరబాబు, నాయకులు పాల్గొన్నారు.

విజిలెన్స్ దాడులు: లూజు సిమెంటు బస్తాలు సీజ్

ఇబ్రహీంపట్నం: స్థానిక ట్రక్ టెర్మినల్‌లోని సిమెంట్ గోడౌన్‌పై విజిలెన్స్ అధికారులు దాడి చేశారు. గోడౌన్‌లో నిల్వ చేసిన లూజు సిమెంట్ బస్తాలను మంగళవారం స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. అందిన సమాచారం మేరకు డెప్యూటీ సీటీఓ వి.మహేష్‌కుమార్ నేరుగా సిమెంట్ గోడౌన్ వద్దకు వెళ్లి పరిశీలించారు. అక్కడ 870 లూజు సిమెంట్ బస్తాలు ఉన్నట్లు గుర్తించారు. వీటికి సంబంధించి ఎటువంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశారు. నిర్వాహకుడు అప్పారావుపై కేసు నమోదుచేశారు. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ వసంత్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మైలవరంలో జాబ్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొండపల్లి ఐడీఏలోని ఆర్చ్ లేబొరేటరీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, కళాశాల రసాయన శాస్త్ర విభాగం, జేకేసీ ఆధ్వర్యంలో మంగళవారం జాబ్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. రిక్రూట్‌మెంట్‌కు 22 మంది హాజరు కాగా ఏడుగురు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. లేబొరేటరీస్ హెచ్ఆర్ నరసింహారావు, కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ ఎస్.వెంకటాద్రి, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వి. ఫణికుమార్, జేకేసీ కో–ఆర్డినేటర్ సుభాషిణి పాల్గొన్నారు.

ఈవీఎం వినియోగంపై అవగాహన

జి.కొండూరు: ఈవీఎం వినియోగంపై ప్రజలకు అవగాహన కార్యక్రమం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఈవీఎం, వీవీప్యాట్ పనితీరు, ఓటు వేసే విధానాన్ని ఏఎస్ఓ అనంద్ వివరించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలి

చాట్రాయి: మండలంలోని ఇంటి పన్నుల వసూలు వేగవంతం చేయాలని డీఎల్‌పీఓ సుందరి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. ఈఓపీఆర్‌డీ మురళీకృష్ణ తదితరుల పాల్గొన్నారు.

నేడు ఆసరా చెక్కుల పంపిణీ

తిరువూరు: తిరువూరు నగర పంచాయతీ పరిధిలోని పొదుపు సంఘాల సభ్యులకు బుధవారం తిరువూరులోని షాదీఖానాలో వైఎస్సార్ ఆసరా చెక్కులను పంపిణీ చేస్తామని పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ అధికారి ప్రసాద్ తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమంలో మెప్మా సభ్యులు పాల్గొనాలని కోరారు.

దాడి ఘటనపై ఫిర్యాదు

ఇబ్రహీంపట్నం: లారీ యూనియన్ కార్యాలయంలో గుమస్తాగా పనిచేస్తున్న బండారు లక్ష్మణరావుపై చింత సుబ్రహ్మణ్య వర్మ, మరో నలుగురు కలిసి దాడిచేశారు. మంగళవారం జరిగిన ఘటనపై బాధితుడు లక్ష్మణరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రోడ్డు పక్కన లారీలు ఆపినందుకు అకారణంగా తనపై నిందితులు దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

61 మందికి నేత్ర వైద్య పరీక్షలు

చాట్రాయి: శ్రీ భగవాన్ సత్యసాయి సేవా ట్రస్ట్, నూజివీడు గిఫర్డ్ మెమోరియల్ కంటి ఆస్పత్రి సహకారంతో పేదలకు చేస్తోన్న సేవలు మరువలేనివని చనుబండ సర్పంచ్ విస్సంపల్లి జ్యోతి అన్నారు. మంగళవారం స్థానిక సచివాలయం వద్ద నిర్వహించిన కంటి వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా 61 మందికి వైద్య పరీక్షలు చేయగా 22 మందికి కంటి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారని ట్రస్ట్ అధ్యక్షుడు జె.రంగారెడ్డి తెలిపారు. కంటి వైద్యులు దత్తు, ఎంపీటీపీ దార్ల సోనీ ఆనంద్, వైఎస్సార్ సీపీ నాయకులు మోరంపూడి నాగేశ్వరరావు, పొగడపూల శివకుమార్, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

నేడు తలనీలాల సేకరణకు వేలం

మైలవరం: మైలవరం మండలం బొర్రగూడెం గ్రామంలోని తిరుపతమ్మ, గోపయ్య స్వామివార్ల దేవస్థానంలో స్వామివార్లకు భక్తులు సమర్పించిన తలనీలాలు పోగు చేసుకునే హక్కునకు బుధవారం ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్‌వీ సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 1, 2024 నుంచి జనవరి 31, 2025 వరకు ఏడాది పాటు తలనీలాలు పోగు చేసుకునే హక్కునకు వేలం నిర్వహిస్తామని చెప్పారు. ఇతర వివరాలకు దేవాలయ కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు.